

ఇలా.. ఇంకెన్నేళ్లు..!?
నిర్మల్ జిల్లాలో రాంజీ సహా వెయ్యి మందిని 1860 ఏప్రిల్ 9న ఉరితీశారు. నిర్మల్ గడ్డపై జరిగిన పోరుకు, వారి త్యాగాల తీరుకు తగిన గుర్తింపు దక్కడం లేదు. 8లో▸



'కౌలు'కు డిమాండ్..!
జిల్లాలో మళ్లీ కౌలు కాలం ప్రారంభమైంది. గ్రామాల్లో భూములు వెతుకుతున్నారు. జిల్లాలో సుమారు 35 వేల మంది కౌలు రైతులు ఉన్నట్లు అంచనా. 9లో▸

గరిష్టం/కనిష్టం
38.8 /26.4

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రౌండ్‌లో దిగి.. బ్యాట్ పట్టి



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి(ఆసిఫాబాద్): డైలీ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వాంకిడి ప్రీమియర్ లీగ్ సీజన్- 3' టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచా రు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆ తర్వాత గ్రౌండులో దిగి బ్యాట్ పట్టి సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఎంచుకున్న రంగంలో గుర్తింపు సాధించి పుట్టి పెరిగిన ఊరు, జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే టోర్నమెంట్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్, నాయకులు, వ్యాపారులు జగదీష్, బండె తుకారాం, అయ్యూబ్, గాదె విలాస్, అవినాష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటిగ్రేటెడ్' నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న గణపతిరెడ్డి

ఆసిఫాబాద్: వాంకిడి మండలం ఇందాని శివారులో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించే స్థలాన్ని తెలంగాణ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ గణపతిరెడ్డి మంగళవారం ఎస్ఈ షఫీ మియా, ఈఈ అశోక్, తహసీల్దార్ రియాజ్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సమీకృత గురుకులానికి 15 ఎకరాలు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. నెల రోజుల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి టెండర్లు నిర్వహిస్తామని తెలిపారు. మూడు నెలల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డీఈఈ శ్రీనివాస్‌గౌడ్, ఏఈ కిరణ్‌కుమార్, అధికారులు ఉన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె'



నోటీసు ఇస్తున్న కార్మికులు, నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 19 తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్తామని జీపీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెర్క శ్రీకాంత్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందించారు. ఆయన మాట్లాడుతూ రెండో పీఆర్సీ పరిధిలోకి పంచాయతీ సిబ్బందిని తీసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. జీవో 51 సవరించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, పాత కేటగిరీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల దహన సంస్కారాలకు రూ.10వేలు చెల్లించాలన్నారు. పంచాయతీ సిబ్బందిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నగేశ్, శంకర్, మోరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పని ప్రదేశానికి చేరుకోవాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్న అధికారులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఉపాధిహామీ పథకంలో పనిచేసే మేట్లు సకాలంలో పనుల ప్రదేశానికి చేరుకోవాలని డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధిహామీ మేట్లకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మస్టర్ల ప్రింట్ మూడు రోజులు ముందుగానే తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేతనాలేవి..?

- కులగణన పూర్తయి ఐదు నెలలైనా అందని గౌరవ వేతనం
- ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఆపరేటర్లకు తప్పని ఎదురుచూపులు
- జిల్లాలో 1,61,901 కుటుంబాల వివరాలు సేకరణ



గౌరవ వేతనాలు చెల్లించాలని వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): సమగ్ర సర్వే ముగిసి ఐదు నెలలు కావొస్తున్నా.. విధులు నిర్వర్తించిన సిబ్బంది ఖాతాల్లో ఇప్పటివరకు వేతనం జమ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణనలో వివరాలు సేకరించిన వారు గౌరవ వేతనం కోసం ఎదురుచూస్తున్నారు. సర్వే అనంతరం ఈ ప్రక్రియలో భాగస్వాములైన ప్రతీఒక్కరికి గౌరవ వేతనం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ నెలలు గడుస్తున్నా డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో సర్వే చేసిన ఎన్యూమరేటర్లు, పరిశీలన జరిపిన సూపర్‌వైజర్లు, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన కంప్యూటర్ ఆపరేటర్లకు నిరీక్షణ తప్పడం లేదు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణనను రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ మొదటి వారంలో ప్రారంభించి అదే నెలలో పూర్తి చేసింది. సిబ్బంది ఇంటింటా తిరిగి స్టిక్కర్లు అతికించారు. అనంతరం కుటుంబాల వారీగా వివరాలు సేకరించారు. ఈ ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, రిసోర్స్ పర్సన్లు ఇతర సిబ్బంది భాగస్వాములయ్యారు. సర్వేను పరిశీలించేందుకు ఎంపీడీవో స్థాయి అధికారులను నోడల్ అధికారులగా నియమించారు.

1,61,901 కుటుంబాల సర్వే..

జిల్లాలో కాగజ్‌నగర్‌తోపాటు నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్‌తో కలిపి రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. 15 మండలాల్లో 335 గ్రామ పంచాయతీలు ఉండగా 5,15,812 జనాభా ఉంది. జిల్లాలో 1292 మంది ఎన్యూమరేటర్లు, 153 మంది సూపర్‌వైజర్లు 1,61,901 కుటుంబాలను సర్వే చేశారు. ఒక్కొక్క ఎన్యూమరేటర్ 150 కుటుంబాల చొప్పున కేటాయించగా సర్వే విజయవంతంగా పూర్తిచేశారు. 1,61,901 కుటుంబాలకు చెందిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ పరిస్థితులతో పాటు కులం వివరాలు సేకరించారు. ఒక్కొక్క కుటుంబానికి 8 పేజీలతో కూడిన ఫారం ఉండగా అందులో మొత్తం 75 రకాల ప్రశ్నలు ఉన్నాయి. సర్వే సమయంలో ఎన్యూరేటర్లు ఓపికతో కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఇంటింటికి తిరుగుతూ సేకరించిన సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రభుత్వ కార్యాలయాల కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు ప్రైవేటు సిబ్బందిని కూడా నియమించారు.

నిధుల కొరతే కారణమా.?

జిల్లాలో సర్వే నిర్వహించిన వారికి భత్యం చెల్లించడానికి దాదాపు రూ.2 కోట్ల నిధులు అవసరం అవుతాయి. జిల్లా ప్లానింగ్ కార్యాలయం ద్వారా సర్వేలో పాల్గొన్న వారికి భత్యం జమ చేసేందుకు ఏర్పాట్లు సైతం చేశారు. ఖాతాల నంబర్లు సేకరించి నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్కరికి కూడా నయాపైసా రాలేదు. జిల్లా ప్లానింగ్ అధికారులను అడిగితే ట్రెజరీకి బిల్లులు పంపించామని, ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే సొమ్ము జమ అవుతుందని చెబుతున్నారు. ఆర్థికశాఖ వద్ద నిధుల కొరత తీవ్రంగా ఉండటంతోనే టోకెన్లు జారీ చేసినా డబ్బులు జమ కావడం లేదని తెలుస్తోంది. సమగ్ర సర్వే భత్యం డబ్బులు చెల్లించాలని సిబ్బంది కోరుతున్నారు.

సర్వే సిబ్బంది వివరాలు	జిల్లా జనాభా 5,15,812		
	సర్వే చేసిన కుటుంబాలు	ఎన్యూమరేటర్లు	సూపర్‌వైజర్లు
	1,61,901	1,292	153

ఐదు నెలలుగా నిరీక్షణ..

సర్వే సిబ్బంది కొన్నినెలలుగా గౌరవ వేతనం కోసం నిరీక్షిస్తున్నారు. సర్వే కొనసాగుతున్న సమయంలోనే ఎన్యూమరేటర్లకు రూ.10 వేలు, సూపర్‌వైజర్లకు రూ.12 వేలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కొక్క ఫారానికి రూ.30 చొప్పున ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన జిల్లాలో సర్వే నిర్వహించిన న్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు దాదాపుగా రూ.1.50 కోట్ల నిధులు అవసరమవుతాయి. అలాగే జిల్లావ్యాప్తంగా డేటా ఎంట్రీ చేసిన కంప్యూటర్ ఆపరేటర్లకు మరో రూ.50 లక్షల వరకు చెల్లించాలి. సర్వే విధుల్లో పాల్గొన్న సిబ్బంది తమ బ్యాంకు ఖాతా వివరాలను అప్పట్లోనే అధికారులకు అందజేశారు. నాటి నుంచి డబ్బులు వస్తాయని ఎదురుచూస్తున్నా ఇప్పటివరకు ఖాతాల్లో జమ కాలేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి త్వరగా డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని వారు కోరుతున్నారు.

డబ్బులు చెల్లించాలి



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేకు సంబంధించిన ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. డాటా ఎంట్రీ ప్రక్రియ పూర్తయి ఐదు నెలలు గడిచింది. కానీ ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదు. అధికారుల సూచనల మేరకు రాత్రి పూట కూడా కష్టపడి పనిచేశాం. ఉన్నతాధికారులు స్పందించి డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి.

– పైశెట్టి వేణు, ప్రైవేటు డాటా ఎంట్రీ ఆపరేటర్

బాధ్యతగా పని చేశారు



ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరిస్తూ సమగ్ర సర్వేలో ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేశారు. సెలవు దినాల్లోనూ సర్వే నిర్వహించి రిపోర్టును ప్రభుత్వానికి నివేదించారు. కానీ గౌరవ వేతనం ఇప్పటివరకు ఖాతాల్లో జమ కాలేదు. కాలయాపన చేయకుండా వెంటనే విడుదల చేయాలి.

– శాంతి కుమారి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు

అవకతవకలు జరగకుండా చూడాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

వాంకిడి(ఆసిఫాబాద్): సన్నబియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా రేషన్ డీలర్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని డీఆర్ డిపోలో మంగళవారం ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సన్నబియ్యాన్ని రేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులందరికీ బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం వాంకిడి పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకం, సంరక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు నాటేందుకు సిద్ధం చేసిన బెడ్లు ఖాళీగా ఉండటంపై వివరణ కోరారు. కొన్ని బెడ్లలో మొక్కలు ఎండిపోయి ఉండటంతో వ్యవసాయ, అటవీశాఖ నుంచి మొక్కల పెంపకంపై సలహాలు తీసుకోవాలని సూచించారు. నర్సరీలో పంచామృతం అందుబాటులో ఉంచాలని, క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏపీవో శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రానీయొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

ఆసిఫాబాద్: వేసవిలో తాగునీటి సమస్యలు రానీయొద్దని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి మంగళవారం అన్ని మండలాల ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, మిషన్ భగీరథ ఇంజినీర్లు, ఉపాధి హామీ సిబ్బందితో తాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధిహామీ పనుల కల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలన్నారు. పైప్‌లైన్లు, మోటార్లు, గేట్‌వాల్ ఇతర మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. అలాగే జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి వందరోజుల ఉపాధిహామీ పనిదినాలు కల్పించాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకంలో పైలట్ గ్రామాల్లో బేస్‌మెంట్ పనులు పూర్తిచేసిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో దత్తారావు, డీపీవో భిక్షప తి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జె డ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

యువ వికాసం దరఖాస్తులు పరిశీలించాలి

నిరుద్యోగ యువత సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సందర్శించారు. రాజీవ్ యువ వికాసం పథకంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతర ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగులు మీసేవ కేంద్రాల ద్వారా రాజీవ్ యువ వికాసానికి ఈ నెల 14 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత ప్రతులను దరఖాస్తుదారుల నుంచి అధికారులు తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల నమోదు ప్రక్రియను పరిశీలించి.. పథకం నిర్వహణపై అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ సహకార సంస్థ ఈడీ సజీవన్, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో శ్రీనివాస్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షిక పరీక్షలు



గోయగాం పాఠశాలలో మాదిరి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

- ఈ నెల 17 వరకు ఎస్‌ఏ- 2 పరీక్షలు
- 23న ఫలితాలు వెల్లడి
- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ

కెరమెరి/ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర విద్యాశాఖ ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షల షెడ్యూల్ ప్రకటించింది. బుధవారం నుంచి ఈ నెల 17 వరకు సమ్మెటీవ్ అసెస్‌మెంట్(ఎస్‌ఏ- 2) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, ఎనిమిదో తరగతి వారికి ఉదయం 9 గంటల నుంచి ఉదయం 11.45 గంటల వరకు, ఇక తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ ఎగ్జామ్స్ కొనసాగనున్నాయి. అయితే తొమ్మిదో తరగతి భౌతికశాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టులకు మాత్రం ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు మాత్రమే సమయం ఇస్తారు.

83,069 మంది విద్యార్థులు

జిల్లాలో అన్ని యాజమాన్యాల కింద పనిచేస్తున్న పాఠశాలలు 1,244 ఉన్నాయి. ఆయా స్కూళ్లలో 83,069 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో విద్యుత్, తాగునీటి వసతులు కల్పించారు. ఇప్పటికే పదో తరగతి వార్షిక పరీక్షలు ముగిసిన విషయం తెలిసిందే. ఈ నెల 17తో పాఠశాల విద్యార్థులకు వార్షిక పరీక్షలు ముగియనున్నాయి. ఇప్పటికే ఎస్‌ఏ- 1తోపాటు పాఠ్యాంశాల మార్కులు, హాజరు వివరాలు, గ్రేడింగ్ వివరాలను రికార్డు రిజిస్టర్‌లో నమోదు చేశారు. విద్యార్థుల వారీగా మార్కులు, హాజరును పాఠశాల విద్యాశాఖ సంచాలకుల వెబ్‌సైట్ ఐఎస్ఎంఎస్‌లో నమోదు చేయాల్సి ఉంది. 2024- 25 విద్యా సంవత్సరం ఈ నెల 23తో ముగియనుంది. అప్పటిలోగా సంబంధిత ఉపాధ్యాయులు వార్షిక పరీక్షల జవాబు పత్రాలు మూల్యాంకనం చేసి రికార్డుల్లో నమోదు చేయనున్నారు. చివరి రోజు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు అందజేయనున్నారు.

తరగతుల వారీగా టైం టేబుల్

తేదీ	1 నుంచి 5	6 నుంచి 7	8వ	9వ
9	-	తెలుగు/ఉర్దూ	తెలుగు/ఉర్దూ	తెలుగు/ఉర్దూ
10	-	హిందీ/తెలుగు	హిందీ/తెలుగు	హిందీ/తెలుగు
11	తెలుగు	ఇంగ్లిష్	ఇంగ్లిష్	ఇంగ్లిష్
12	ఇంగ్లిష్	సాంఘిక శాస్త్రం	గణితం	గణితం
15	గణితం	సామాన్యశాస్త్రం	భౌతికశాస్త్రం	భౌతికశాస్త్రం
16	ఈవీఎస్	గణితం	జీవశాస్త్రం	జీవశాస్త్రం
17	-	-	సాంఘికశాస్త్రం	సాంఘికశాస్త్రం

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

1 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షలు, బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్ లైన్ పరీక్షల ప్రగతి వివరాలను ప్రధానోపాధ్యాయులు విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. వివరాల నమోదు ఈ నెల 21 వరకు పూర్తి చేసి, 23న విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందించాలి.

– ఉదయ్‌బాబు, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్ రోహిత్

ఆసిఫాబాద్‌రూరల్: బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రోహిత్ దేశ్‌పాండే అన్నారు. ముందస్తు సమాచారం మేరకు ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులతో కలిసి మంగళవారం బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. బంధువులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలికను సఖి కేంద్రానికి తరలించారు. ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేయడం నేరమన్నారు. మైనర్ల పెళ్లిలను ప్రోత్సహిస్తే ఇరువైపులా కుటుంబ సభ్యులు, పురోహితులపైనా నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి, రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు. బాలికల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 18 ఏళ్లు నిండే వరకు చదివించి ఆ తర్వాత వివాహం జరిపించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాల గురించి సమాచారం ఉంటే 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ బాల ప్రవీణ్, సూపర్‌వైజర్ లైలా, సిబ్బంది చంద్రశేఖర్, రవళి పాల్గొన్నారు.

'స్థానిక ఉద్యోగులపై వివక్ష'



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీఎం) యాజమాన్యం స్థానిక కార్మికులపై వివక్ష చూపుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్థానికేతర కార్మికుల కంటే స్థానికులకు తక్కువ జీతాలు ఇస్తున్నారని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్- 14 సమానత్వపు హక్కుకు వ్యతిరేకమని తెలిపారు. పని ఒక్కటే అయినప్పుడు జీతాలు వేర్వేరుగా ఎందుకుంటాయని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతోనే మిల్లు పునఃప్రారంభానికి కృషి చేశారని గుర్తుచేశారు. మిల్లు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరితే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల సెలవులు తగ్గించారని, డెవిడెంట్ రావడం లేదని, పిల్లలకు రావాల్సిన నోట్‌బుక్స్ కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రానున్న మిల్లు యూనియన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్మికుల పక్షాన నిలబడుతుందని హామీ ఇచ్చారు. ఈ నెల 15న పేపర్‌మిల్లు కార్మికుల సమక్షంలో మేధోమథన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, మోయిన్, అంబాల ఓదెలు, గోగర్ల కన్నయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనివేళలు మార్చాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పనివేళలు మార్చాలని ఏఐటీయూసీ రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ అన్నారు. గోలేటిలో మంగళవారం ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుందని, కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పనివేళలు మార్చాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు సైతం ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు, చల్లటి తాగునీరు అందించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టర్లు మారితే కార్మికులను మార్చొద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాయిల్ల నర్సయ్య, నంది శేఖర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వానికి చరమగీతం పాడాలి



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: దేశంలో నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. పట్టణంలోని 21, 22, 26, 30 వార్డులతో పాటు మార్కెట్ ఏరియాలో మంగళవారం జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అంబేద్కర్ ఇచ్చిన స్వేచ్ఛ, సామాజిక సమానత్వాన్ని బీజేపీ నుంచి కాపాడాలని కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

కోఆర్డినేటర్‌గా సిడాం గణపతి

బెజ్జూర్: జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమానికి సిర్పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి నియమించినట్లు ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు తెలిపారు. అలాగే బెజ్జూర్ మండలానికి కోఆర్డినేటర్‌గా బండి మహేశ్, చింతలమానెపల్లి సామల రాజన్న, పెంచికల్‌పేట్ మడావి కోటేశ్, దహెగాం రాచకొండ కృష్ణ, కాగజ్‌నగర్ పట్టణం వందన, కాగజ్‌నగర్ రూరల్ రమేశ్, కౌటాల పిల్లల శంకరయ్య, సిర్పూర్(టి) అష్రత్‌ను నియమించినట్లు వారు వెల్లడించారు.

క్లుప్తంగా

వృద్ధురాలు అదృశ్యం


పోసక్క(ఫైల్)

కోటపల్లి: మండలంలోని నాగంపేటకు చెందిన పత్తి పోసక్క (68)ఈనెల 5న భర్త పోచయ్యతో కలిసి మొక్కజొన్న చేనుకు కాపలాగా వెళ్లింది. భర్త చేను వద్దే కాపలా ఉండగా వృద్ధురాలు చీపురు పుల్లల కోసమని అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు అటవీప్రాంతంలో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోచయ్య మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

బెట్టింగ్ ఆడుతున్న నలుగురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని సినిమా రోడ్ ప్రాంతంలో గల ట్రెండి కలెక్షన్‌లో పద్మావతి కాలనీకి చెందిన గిత్తె సూర్యకాంత్, దస్నాపూర్‌కు చెందిన పెద్వాల్ పంకజ్, శాంతినగర్‌కు చెందిన నమ్మెవార్ విశాల్, టీచర్స్ కాలనీకి చెందిన అలవత్ బాల్‌దేవ్‌ను పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లతో పాటు రూ.2,210 నగదు స్వాధీనం చేసుకుని ఎస్సై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూమి విక్రయిస్తామని మోసగించిన ఆరుగురిపై..

బెల్లంపల్లిరూరల్: భూమి విక్రయిస్తామని మోసగించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన ఒంటెల రవికుమార్‌కు బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి శివారులో 6 ఎకరాల 12 గుంటల భూమి అమ్ముతామని కొందరు వ్యక్తులు చెప్పడంతో వారికి రూ.39.76 లక్షల నగదు అప్పగించాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తులు భూమిని రి జిస్ట్రేషన్ చేయకుండా మోసగించారు. దీంతో బాధితుడు సోమవారం రాత్రి తాళ్లగురి జాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బెల్లంపల్లికి చెందిన రాగంశెట్టి సత్యనా రాయణ (సతీశ్), మల్లీశ్వరి, భీమయ్య, శ్రీ కాంత్, జగదీశ్, ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడిగుడ్ల వాహనం బోల్తా


బోల్తాపడిన మినీ వ్యాన్

నేరడిగొండ: మండలంలోని కొర్టికల్ డౌనల్ రోడ్డు ప్రాంతంలో మినీ వ్యాన్ బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే.. ఆర్మూర్ నుంచి మహారాష్ట్రలోని సార్థాని వైపు మంగళవారం కోడిగుడ్లలోడ్‌తో మినీ వ్యాన్ బయలుదేరింది. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఓ ద్విచక్ర వాహనదారుడు అడ్డురావడంతో డ్రైవర్ తప్పించబోయి ఈ ఘటన చోటు చేసుకుంది. వ్యాన్ రోడ్డుపై బోల్తా పడడంతో అందులోని కోడిగుడ్లు రోడ్డుపై పడి పగిలిపోయాయి. ఘటనలో వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ ఉమేర్‌తో పాటు మరొకరు సురక్షితంగా బయటపడ్డారు.

అత్యాచారం కేసులో నలుగురి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ బాలిక(12)పై అత్యాచారం చేసిన నలుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలికను ఓ వివాహిత ఆదివారం మధ్యాహ్నం సమీప అడవిలోకి తీసుకెళ్లింది. ఇద్దరు యువకులను అక్కడికి వెంటబెట్టుకోని రాగా వారు ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. రాత్రి ఇంటికి తిరిగొచ్చిన బాలిక విషయాన్ని తల్లికి వివరించింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరు యువకులతో పాటు మహిళ, మరో మధ్యవర్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వన్యప్రాణుల మాంసం పట్టివేత?


భీమారం: చెన్నూర్ అటవీరేంజ్ పరిధిలోని భీమారం మండలం నర్సింగాపూర్‌లో అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల మాంసం స్వాధీనం చేసుకుని పలువురిని అరెస్ట్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సింగాపూర్ అటవీప్రాంతంలో ఆదివారం రాత్రి వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చి రెండు కొండె గొర్రెలను వేటాడినట్లు తెలిసింది. వాటి మాంసాన్ని విక్రయించేందుకు సోమవారం పోగులు వేస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నట్లు తెలిసింది. మాంసాన్ని స్వాధీనం చేసుకుని పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై చెన్నూర్ అటవీ రేంజ్ అధికారి శివకుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా జంతువుల మాంసం పట్టుకున్న మాట వాస్తవమేనన్నారు.

ఇలా.. ఇంకెన్నేళ్లు..!?


తెలంగాణ తల్లి రూపశిల్పి బీవీఆర్‌చారి గీసిన వెయ్యి ఉరులమర్రి చిత్రం

- వాళ్ల ప్రాణాలకూ విలువనివ్వరా?
- వెయ్యిమంది త్యాగాలకు లెక్కలేదా?
- అధికారికంగా నివాళులూ అర్పించలేరా?
- 'వెయ్యి ఉరులమర్రి' సాక్షిగా వివక్ష
- నేడు ఆ అమరవీరుల త్యాగాలదినం

వాళ్ల పోరాటం తెలుసుకుంటే రోమాలు నిక్కబొడ్చుకుంటయ్. తమపై సాగిస్తున్న అరాచకాలను ఎదుర్కొనేందుకు.. వారు ముందుకురికిన తీరు రక్తాన్ని ఉడికిస్తుంది. చరిత్ర సైతం గోసపెట్టుకునేలా వారు చేసిన ప్రాణత్యాగాలు కళ్లను చెమరుస్తాయి. వారి వీరగాథ గుర్తుకొచ్చినప్పుడల్లా చేతులు వాటంతటవే జోడిస్తాయి. కానీ.. అలాంటి వీరుల ప్రాణత్యాగాలను ప్రభుత్వాలు చిన్నచూపు చూడటమే కలచివేస్తోందని నిర్మల్ జిల్లా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గడ్డపైనే పోరాడి, తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన రాంజీగోండు సహా వెయ్యి మంది వీరుల త్యాగాలకు ఇంకెప్పుడు అధికారిక నివాళులర్పిస్తారు..!? అన్న ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం రావడం లేదు. నేడు (ఏప్రిల్ 9) రాంజీసహా వెయ్యిమంది వీరుల త్యాగాలదినం.. – నిర్మల్


జిల్లాకేంద్రంలో రాంజీగోండు విగ్రహం

దేశ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి కొనసాగింపుగా తెలంగాణ–మహారాష్ట్ర ప్రాంతంలోనూ ఉమ్మడి శత్రువులపై గోండులు, రోహిల్లాలు, మరాఠీలు, దక్కనీలు పోరు చేశారు. నిర్మల్ కేంద్రంగా 1858–60 వరకు ఈ పోరాటం సాగింది. అడవుల్లోకి చొచ్చుకొస్తూ.. ఆదివాసుల ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తున్న ఆంగ్లేయ, నైజాం సేనలపై జనగాం (ఆసిఫాబాద్) కేంద్రంగా చేసుకున్న గోండువీరుడు మర్సుకోల రాంజీగోండు పోరాటం ప్రారంభించాడు. నిజాం సేనలతో కలిసి నిర్మల్ కలెక్టర్ ప్రజలను పీడిస్తున్నాడని రాంజీగోండు ఈ ప్రాంతం వైపు వచ్చాడు. తాంతియాతోపే అనుచరులైన రోహిల్లా సిపాయిలు ఆయనకు తోడయ్యారు. రోహిల్లా సర్దార్ హాజీతో కలిసిన రాంజీ.. ఉమ్మడి శత్రువులైన ఆంగ్లేయ, నిజాం సేనలపై విరుచుకుపడ్డాడు. సరైన ఆయుధ సంపత్తి లేకున్నా దట్టమైన అడవులు, సహ్యాద్రి కొండలు, గోదావరి నదులను ఆసరాగా చేసుకుని వారిపై దాడులు చేసి దెబ్బతీశారు.

ఒకే మర్రికి.. వెయ్యిమంది ఉరి..

దొంగదెబ్బతో బంధించిన రాంజీ సహా వెయ్యి మందిని శత్రుసేనలు చిత్రహింసలు పెట్టాయి. ఇలాంటి వాళ్లు మళ్లీ తమపై పోరాడేందుకు కూడా సాహించకూడదని నరకం చూపించాయి. వారందరినీ నిర్మల్ శివారులోని ఎల్లపెల్లి దారిలో నేలలో ఊడలు దిగిన మర్రిచెట్టు వద్దకు ఈడ్చుకెళ్లి అందరూ చూస్తుండగా రాంజీ సహా వెయ్యి మందిని 1860 ఏప్రిల్ 9న ఉరితీశారు. దేశ స్వాతంత్ర్య చరిత్రలోనే మును పెన్నడూ జరగని ఈ ఘటన జలియన్‌వాలాబాగ్ కంటే దాదాపు 60 ఏళ్ల ముందే చోటు చేసుకోవడం గమనార్హం. ఆ దారుణం కంటే ఇక్కడ ఎక్కువమందే ప్రాణత్యాగాలు చేసినా.. చరిత్రలో సరైన గుర్తింపు దక్కకపోవడం శోచనీయమని నిర్మల్ జిల్లా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిర్మల్‌గడ్డపై జరిగిన పోరుకు, వారి త్యాగాల తీరుకు తగిన గుర్తింపు తీసుకురావాలని కోరుతున్నారు.

'సాక్షి' అక్షర నివాళులు..

స్వాతంత్రం కోసం సర్వస్వం అర్పించిన సమరయోధులనూ గుర్తించాలని, రాంజీసహా వెయ్యిమంది అమరవీరుల త్యాగాలకు విలువనివ్వాలని అవకాశం దొరికినప్పుడల్లా.. 'సాక్షి' గొంతెత్తుతూనే ఉంది. వరుస కథనాలను ప్రచురిస్తూ.. ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ నాటి చరితను, వారి ఘనతను ప్రజల్లోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. వెయ్యిమంది వీరుల త్యాగాలదినం సందర్భంగా బుధవారం నిర్మల్ పట్టణంలోని డాక్టర్స్‌లైన్‌లో గల డా.కావేరి లైబ్రరీలో సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.

బళ్లారి నుంచి దళం..

రాంజీసేనల దాడుల విషయం కలెక్టర్ ద్వారా హైదరాబాద్ రాజ్యంలో అప్పటి రెసిడెంట్ డేవిడ్సన్, నాటి పాలకుడు అఫ్జల్‌ఉద్దౌలా వరకు తెలిసింది. వీరి పోరును తీవ్రంగా పరిగణించిన పాలకులు అణచివేత కోసం కర్ణాటకలోని బళ్లారిలో ఉన్న 47వ నేషనల్ ఇన్‌ఫ్రాంటీని నిర్మల్ రప్పించారు. కల్నల్ రాబర్ట్ నేతృత్వంలోని ఈ దళానికీ ఇక్కడి ప్రాంతంపై పట్టులేకపోవడంతో రాంజీసేన చేతిలో దెబ్బతింది. ఈ కసితో కల్నల్ రాంజీసేనను దొంగదెబ్బ తీసి, సోన్–కూచన్‌పల్లి ప్రాంతంలో గోదావరి ఒడ్డున పట్టుకున్నాడు.

మనవంతు ప్రయత్నం..



జిల్లాలో ఎన్నో చారిత్రక కట్టడాలు ఉన్నాయి. వెయ్యి ఉరులమర్రి ఘటన ఇక్కడే చోటు చేసుకుంది. వీటిని ముందుతరాలకు అందించేందుకు మావంతు ప్రయత్నం కొనసాగుతోంది. – అభిలాష అభినవ్, కలెక్టర్

అమరధామం కోసం..



నిర్మల్‌గడ్డపై పోరాడి ప్రాణత్యాగం చేసిన రాంజీసహా వెయ్యిమంది వీరులను ప్రతీఒక్కరం స్మరించుకోవాలి. వారిత్యాగాల స్ఫూర్తిని ముందుతరాలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. నిర్మల్‌లోనూ అమరధామం ఏర్పాటు దిశగా ప్రయత్నం చేస్తున్నాం.
– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేఎల్పీనేత

వారి ఆశయాల కోసం..



రాంజీసహా వెయ్యిమంది వీరుల ఆశయాల కోసం పనిచేద్దాం. గతంలో గద్దర్, ప్రజాసంఘాలతో కలిసి నిర్మల్‌లో అమరవీరుల స్థూపం ఏర్పాటుకు కృషిచేశాం. హైదరాబాద్‌లో రాంజీ మ్యూజియం ఏర్పాటవుతోంది. నిర్మల్‌లోనూ స్మారకం ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.
– అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీమంత్రి

ప్రభుత్వానికి విన్నవిస్తాం



నిర్మల్‌గడ్డపై జరిగిన అసమాన పోరాటం, రాంజీ సహా వెయ్యి మంది అమరులకు సరైన గుర్తింపు దక్కలేదన్నది వాస్తవం. వారి ప్రాణత్యాగం ముందుతరాలకూ తెలిసేలా అందరం ప్రయత్నించాలి. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికీ విన్నవిస్తాం.
– కూచాడి శ్రీహరిరావు, డీసీసీ అధ్యక్షుడు

ఇప్పటికైనా గుర్తించాలి..



ప్రథమ భారత సంగ్రామంలోనే నిర్మల్ గడ్డ భాగమైంది. రాంజీసహా వెయ్యి మంది వీరులు మన నేలపైనే ప్రాణత్యాగం చేశారు. ఇప్పటికైనా వారి త్యాగాలకు ప్రభుత్వాలు అధికారికంగా నివాళులర్పించాలి. – పోలీస్ భీమేశ్, రాంజీగోండు స్మారక సమితి

ప్రదర్శనకు ఎంపికైన చిత్రం


చిత్రాన్ని గీస్తున్న శ్రీనివాస్

జైపూర్: ప్రముఖ చిత్రకారుడు, శిల్పి ఏలూరి శేషబ్రహ్మం కాకతీయ శిల్ప సంపద గురించి తెలుసుకునేందుకు జనవరి 25, 26 తేదీల్లో నిర్వహించిన కాకతీయ టెంపుల్ స్కెచింగ్ స్టడీ టూర్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 60 మంది ఆర్టిస్టులు పాల్గొని పలు చిత్రాలు గీశారు. వాటిలో నుంచి ఎంపికైన చిత్రాలతో ఈ నెల 12 నుంచి 14 వరకు మాదాపూర్‌లోని తెలంగాణ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. ఇందులో మంచిర్యాల జిల్లాకు చెందిన చిత్రకారుడు చిప్పకుర్తి శ్రీనివాస్ కాకతీయ శిల్పసంపదపై గీసిన చిత్రం ప్రదర్శనకు ఎంపికైంది.

మట్కా నిందితుల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అగ్ని బాబులాల్ అమాయక ప్రజలకు మట్కా చీటీలు అందజేస్తూ పట్టుబడినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తాంసి బస్టాండ్ వద్ద మట్కా చీటీలు రాస్తుండగా దాడిచేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.730 నగదుతో పాటు సెల్‌ఫోన్, మట్కా పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆన్‌లైన్ మట్కా నిర్వాహకుడు..

ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన మసూద్ ఖాన్ ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహణ చేస్తున్నాడు. మహారాష్ట్రలోని గుర్లాయికి సంబంధించిన సంస్థకు డబ్బులు పంపిస్తుండగా పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. నిందితుడి నుంచి నాలుగు సెల్‌ఫోన్లతో పాటు రూ.5,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు వివరించారు.

ఇద్దరు మట్కా నిర్వాహకుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాయినాథ్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని పూసాయి గ్రామ శివారులో మంగళవారం మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. మంగళవారం జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై పురుషోత్తం, ఏఎస్సై సిరాజ్ ఖాన్, కానిస్టేబుళ్లు శివాజీ, స్వామి దాడులు నిర్వహించి ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన కడదారపు గంగన్న, తాంసి మండలంలోని హస్నాపూర్‌కు చెందిన రాకేందర్‌ల నుంచి రూ.4,100 నగదుతో పాటు సెల్‌ఫోన్, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సామాన్య ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి మహారాష్ట్రలోని బోరికి చెందిన గజ్జుకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు వివరించారు. జైనథ్ మండలంలో మట్కా, పేకాట, దేశీదారు వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే 8712659916, 8712659929 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రం శివారులోని బొమ్మరిల్లు టౌన్‌షిప్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. కాలనీలో నివాసం ఉంటున్న బొబ్బిలి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. సోమవారం రాత్రి దొంగలు ఇంటి మెయిన్ డోర్ పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బెడ్‌రూంలో బీరువాలో ఉన్న నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చిన శ్రీకాంత్‌రెడ్డి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ ఎస్సై లింబాద్రి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య


దుర్గం రాము (ఫైల్)

కోటపల్లి: ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల మేరకు మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన దుర్గం రాము (23) ఇంటి వద్దే ఉంటూ తండ్రితో పాటు వ్యవసాయ పనులకు వెళ్తుండేవాడు. తాను ప్రేమించిన యువతి ప్రేమకు నిరాకరించడంతో మనస్తాపం చెందాడు. సోమవారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతుని తండ్రి బాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదిలాబాద్‌లో పశువుల వ్యాపారి...

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఫిరోజ్ సిద్ధిఖి (35) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. పశువుల వ్యాపారం చేస్తున్న ఫిరోజ్ సిద్ధిఖికి నష్టం రావడంతో అప్పుల బాధ తాళలేక అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించగా మంగళవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు.

మనస్తాపంతో బాలిక..

ఇచ్చోడ: మనస్తాపంతో బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల మేరకు మండలంలోని ముకురా(బి)కి చెందిన రఫీక్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంట్లో గొడవలకు దిగేవాడు. దీంతో మనస్థాపానికి గురైన అతని కుమార్తె ఫిర్దోసి (16) మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. మృతిరాలి తల్లి జాబినాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్‌బౌన్స్ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి ఏడాది జైలుశిక్షతో పాటు అప్పుగా తీసుకున్న డబ్బులు చెల్లించాలని స్థానిక సివిల్ కోర్టు జడ్జి కే.నిరోష మంగళవారం తీర్పునిచ్చారు. కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఎస్.పారిజాత మంచిర్యాలకు చెందిన గుమ్మి జగన్నాథ్‌రెడ్డి వద్ద రూ.12లక్షలు అప్పుగా తీసుకుంది. ఒప్పందం ప్రకారం పారిజాత చెక్కులను అందజేసింది. గడువు తీరిన తర్వాత చెక్కును స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యాయి. దీంతో జగన్నాథ్‌రెడ్డి 2017లో కోర్టును ఆశ్రయించగా జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


సంధ్యారాణి(ఫైల్)

జైపూర్: జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన సంధ్యారాణి (40) కుటుంబసభ్యులతో కలసి మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చింది. కారులో స్వగ్రామానికి వెళ్తుండగా ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద జైపూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. మంగళవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులను చూసి పరుగులు తీయడంతో అనుమానం వచ్చి వారిని వెంబడించగా 210 గ్రాముల గంజాయి లభించింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనంతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

యాక్సిడెంట్ కేసులో నిందితునికి జైలు

సోన్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి తొమ్మిది నెలల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ నిర్మల్ కోర్టు న్యాయమూర్తి అజయ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. 2016లో సోన్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో గంగయ్య మృతి చెందగా అతని భార్యసంగర్తనకు గాయాలయ్యాయి. ఇందుకు కారణమైన కొండ సంతోశ్‌గౌడ్‌కు న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

12 డొమెస్టిక్ సిలిండర్ల సీజ్


పట్టుబడిన సిలిండర్లు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, స్వీట్‌హౌజ్‌లలో మంగళవారం అధికారులు తనిఖీలు నిర్వహించి 12 డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ప్రేంని వాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్లు కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే వాడాలని సూచించారు.

ప్రమాదంలో భగీరథ


బూరుగుపల్లి శివారులో మట్టి కొట్టుకుపోవడంతో బయటకు కనిపిస్తున్న భగీరథ పైపులైన్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని మాటేగాం నుంచి ఆదిలాబాద్ జిల్లాతో పాటు అన్ని గ్రామాలకు తాగునీరు అందించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి వేసిన మిషన్ భగీరథ పైపులు మావడ మండలం బూరుగుపల్లి, మొండిగుట్ట అటవీప్రాంతంలో 44 నంబర్ జాతీయ రహదారి సమీపంలో ప్రమాదకరంగా మారాయి. గుట్ట ప్రాంతం నుంచి వచ్చిన వరదకు పైపులైన్ మట్టి కొట్టుకుపోయింది. అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ పైపులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


పై పెచ్చులు ఊడి ప్రమాదకరంగా కనిపిస్తున్న మిషన్ భగీరథ పైపులైన్


గాలిలో తేలియాడుతూ ప్రమాదకరంగా కనిపిస్తున్న భారీ పైపులైన్

గుట్టుగా గంజాయి దందా..


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

ఉట్నూర్‌రూరల్: మండలంలో గంజాయి దందా గుట్టుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 2 కిలోల గంజాయి పట్టుబడింది. ఆదివారం రాత్రి రాములుగూడెంలో రైతు సాగు చేస్తున్న 20 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా మంగళవారం ఉట్నూర్ ఇన్‌చార్జి ఎస్సై సునీల్ ఆధ్వర్యంలో బీర్సాయిపేటలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మండలంలోని లక్కెట్టిపేటకు చెందిన సట్ల గంగన్న , బీర్సాయిపేటకు చెందిన జైనేని ఎల్లయ్య అనుమానస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా 4.900 గంజాయి లభించింది. గంజాయి విలువ రూ.లక్షా 22 వేలు ఉంటుందన్నారు. వారిని విచారించగా మహారాష్ట్రకు చెందిన గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్ కరీంనగర్ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాజీ ఎంపీపీ మంగళ సూత్రం చోరీ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కాపువాడకు చెందిన బెజ్జూర్ మాజీ ఎంపీపీ రోజారమణి మంగళ సూత్రాన్ని గుర్తుతెలియని దుండగులు అపహరించారు. మంగళవారం ఉదయం ఇంటి బయట పనులు చేసుకుంటుండగా ఇద్దరు దుండగులు పూల కోసం వచ్చి ఆమె మెడలోని మంగళ సూత్రాన్ని లాక్కుని వెళ్లిపోయారు. వెంటనే బాధిత మహిళ 100 కు ఫోన్ చేయడంతో పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈసందర్భంగా బాధిత మహిళ మాట్లాడుతూ రెండు రోజులుగా ఇంటి ముందు నుంచి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వాకింగ్ చేస్తున్నారని, అయితే చోరీ జరిగిన సమయంలో మాస్కులు ధరించి ఉన్నారన్నారు.